ఖాళీ బిందెలను ప్రదర్శిస్తూ నిరసన తెలుపుతున్న గాయత్రీనగర్ వాసులు

తాగునీటి గోస మళ్లీ మొదలు..

- పదేండ్లుగా లేని సమస్య మరో మారు ముందుకు..
- ఆరునెలలుగా లో ప్రెజర్‌తో ఇబ్బందులు
- పట్టించుకోని పాలక, అధికార యంత్రాంగం

అల్లాపూర్, డిసెంబర్ 22: కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చాక ఇచ్చిన హామీలు అమలు సంగతి అటుంచుతే, కనీసం తాగు నీరు కూడా ఇవ్వకుండా ప్రజలను గోస పెడుతున్నదని గాయత్రీనగర్ సంక్షేమ సంఘం అధ్యక్షుడు సంజీవరెడ్డి అన్నారు. గత ఆరు నెలలుగా నల్లా నీటి సరఫరాలో లోప్రెజర్ కారణంగా తాగునీరు సరిపోక, నిత్యం వందల రూపాయలు వెచ్చించి నీరు కొన్సాల్సి వస్తున్నదని గాయత్రీనగర్ వాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తాగునీటి ఎద్దడి సమస్యతో విసిగిపోయిన కాలనీవాసులు పెద్ద ఎత్తున మహిళలతో కలిసి గాయత్రీనగర్ గాంధీ విగ్రహం వద్ద ఖాళీ బిందెలు ప్రదర్శిస్తూ నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, గత బీఆర్ఎస్ ప్రభుత్వంలో మిషన్ భగీరథ పథకం ద్వారా రిజర్వాయర్లు నిర్మించి పదేళ్ల పాటు ప్రతి ఇంటికి నీళ్లు అందించిన ఘనత అపరభగీరథుడు అప్పటి సీఎం కేసీఆర్‌దేనని గుర్తు చేసుకున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన మొదటి సంవత్సరంలోనే తాగునీటి సమస్యతో ఇబ్బందులు పడుతున్నామన్నారు. ఇంకా ఎండాకాలం ప్రారంభం కాక ముందే నీటి సమస్య మొదలైందని మార్చి, ఏప్రిల్ నెలల్లో తమ పరిస్థితి ఏంటని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. గతంలో గంట పాటు వచ్చే నల్లా నీరు, ఇప్పుడు కేవలం 20 నుంచి 30 నిమిషాలు మాత్రమే నీటి సరఫరా జరగడంతో తీవ్రమైన నీటి ఎద్దడితో ఇబ్బందులు పడాల్సి వస్తున్నదని ఆందోళన వ్యక్తం చేశారు. సమస్యను పలుమార్లు అధికారుల దృష్టికి తీసుకెళ్లినా, జనాభా పెరిగిపోవడంతో నీటి వినియోగం పెరిగిందని పాత పైపులైన్లు మార్చి కొత్త లైన్లు వేయడానికి తమ వద్ద నిధులు లేవని నిర్లక్ష్యంగా సమాధానం చెప్పారని కాలనీవాసులు తెలిపారు. ఇప్పటికైనా జల మండలి ఉన్నతాధికారులు స్పందించి తమ కాలనీ వాసులకు సరపడా తాగునీరు సరఫరా చేసి సమస్యను పరిష్కరించాలని మహిళలు కోరుతున్నారు. నిరసనలో పాల్గొన్నవారు గాయత్రీనగర్ సంక్షేమ సంఘం ప్రధాన కార్యదర్శి టి.సంజీవ, కోశాధికారి వెంకటరమణ చారి, శ్రీనివాస్, కాశీనాథ్‌చారి, జితేంద్ర, ఉమా మహేశ్వరరావు, నాగేశ్వరరావు, గోపాల్ రెడ్డి, రాజు, సుబ్బారావు, ప్రసాద్ దాసు, శ్రీనివాస్ పద్మజ, డీవీఆర్ నాయుడు, పెద్ద ఎత్తున మహిళలున్నారు.

ముత్యాలమ్మకు బోనం

అమ్మ వారికి పూజలు చేసిన ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత

అమ్మవారి క్యాలెండర్ ఆవిష్కరించిన ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత

మారేడ్‌పల్లి, డిసెంబర్ 22: సికింద్రాబాద్ కుమ్మరిగూడలోని ముత్యాలమ్మ ఆలయంలో ఆదివారం బోనాల ఉత్సవాలు కన్నుల పండువగా జరిగాయి. పోతురాజుల విన్యాసాలు, శివ సత్తుల పూనకాల మధ్య అమ్మవారి ఫలహారపు బండ్ల ఊరేగింపుతో మహిళలు సాక పోసి, అమ్మవారికి బోనం సమర్పించారు. కాగా, ఈ నెల 11న ఆలయంలో అమ్మవారి విగ్రహాన్ని పునర్ ప్రతిష్ఠించారు. ఉదయం నుంచి భక్తులు పెద్ద ఎత్తున ఆలయానికి చేరుకొని అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. ఉత్సవాల్లో భాగంగా ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత, కేంద్ర మంత్రి జి.కిషన్ రెడ్డి, ఎంపీ ఈటల రాజేందర్, స్థానిక ఎమ్మెల్యే శ్రీగణేశ్, స్థానిక కార్పొరేటర్ కొంతం దీపిక అమ్మవారిని దర్శించుకున్నారు. భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా మార్కెట్ పోలీసులు బందోబస్తును నిర్వహించారు. సీతాఫల్‌మండి కార్పొరేటర్ సామల హేమ, మోండా డివిజన్ బీఆర్ఎస్ డివిజన్ అధ్యక్షుడు ఆకుల హరికృష్ణతో కలిసి ఆలయ కమిటీ ఆహ్వానం మేరకు ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత అమ్మవారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ మాట్లాడుతూ అమ్మవారిని దర్శించుకోవడం ఆనందంగా ఉందన్నారు. రాష్ట్ర ప్రజలంతా సుఖ సంతోషాలతో బాగుండాలని అమ్మవారిని కోరుకున్నట్లు వెల్లడించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీతో స్థానిక మహిళలు, యువత సెల్ఫీలు దిగేందుకు పోటీ పడ్డారు. ఓపికగా ప్రతి ఒక్కరితో ఎమ్మెల్సీ కవిత ఫొటోలు దిగారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, బస్తీవాసులు, వివిధ పార్టీలకు చెందిన నాయకులు నందికంటి రవి, సి.సంతోష్ యాదవ్, శేఖర్ ముదిరాజ్, నాగేశ్, నాగేందర్ యాదవ్, కొంతం నరేశ్, సరిత పాల్గొన్నారు.

ఎంబీసీలను విస్మరించిన కాంగ్రెస్ ప్రభుత్వం

- కనీసం మంత్రిత్వ శాఖ ఏర్పాటు చేయాలి
- ఎన్నికల హామీలను మరిచారు
- జాతీయ ఎంబీసీ, డీఎన్టీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు నర్సింహ సాగర్

సమావేశంలో మాట్లాడుతున్న నర్సింహ సాగర్

ఖైరతాబాద్, డిసెంబర్ 22: అత్యంత వెనుకబడి ఉన్న ఎంబీసీలను కాంగ్రెస్ ప్రభుత్వం విస్మరించిందని జాతీయ ఎంబీసీ, డీఎన్టీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు బంగారు నర్సింహ సాగర్ అన్నారు. సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఆదివారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో బీసీ సమాజ్ అధ్యక్షులు సంగెం సూర్యారావుతో కలిసి మాట్లాడారు. ఎన్నికల ముందు ఎంబీసీల సంక్షేమానికి పాటు పడుతామని హామీ ఇచ్చిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఏడాది అయినా, ఇంకా అమలు చేయడం లేదన్నారు. ప్రభుత్వం కార్పొరేషన్ ఏర్పాటు చేసి చైర్మన్‌ను నియమించినా పాలక మండలిని పూర్తి స్థాయిలో ఏర్పాటు చేయలేదన్నారు. సమాజంలో బీసీలు 60, ఎంబీసీలు 30 శాతం ఉన్నారని, సమగ్ర కులగణనలో ఎంబీసీల వాటా తేల్చాలని, శాస్త్రీయ పద్ధతిలో వారిని వర్గీకరించాలన్నారు. ఎంబీసీలకు ప్రత్యేక మంత్రిత్వ శాఖ లేదని, రాజకీయ ప్రాతినిధ్యం అసలే లేదన్నారు. ఫలితంగా సంక్షేమ పథకాలకు నోచుకోవడం లేదని, రాజకీయం, విద్య, ఉద్యోగాల్లో తీరని అన్యాయం జరుగుతుందన్నారు. ఒక నటుడి విషయంలో గంటల తరబడి అసెంబ్లీలో చర్చ నిర్వహిస్తున్నారని, కానీ, ఓట్లు వేసి గెలిపించిన ఎంబీసీల ప్రస్తావనే తీసుకురావడం లేదన్నారు. ప్రభుత్వం ఏర్పాటు చేసిన కార్పొరేషన్‌కు కనీసం వెయ్యి కోట్ల బడ్జెట్‌ను కేటాయించాలన్నారు. ప్రభుత్వ కాంట్రాక్ట్ పనులను ఇస్తామని ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలన్నారు. కనీసం వెయ్యి కోట్ల నిధులు కేటాయించాలన్నారు. వెనుకబడిన జిల్లా నుంచి వచ్చానని చెప్పుకునే ముఖ్యమంత్రి అత్యంత వెనుకబడిన తరగతులైన ఎంబీసీల గురించి పట్టించుకోవడం లేదన్నారు. ఇప్పటికైనా తమ వర్గాలను గుర్తించి ఆదుకోవాలన్నారు. వచ్చే నెల 12న నగరంలో ఎంబీసీల దళిత మహాసభ నిర్వహించి ప్రభుత్వానికి తమ సత్తా చాటుతామన్నారు. సమావేశంలో ఎంబీసీ సంక్షేమ సంఘం వ్యవస్థాపకులు సత్యం వంశరాజ్, కోశాధికారి ఓర్సు కృష్ణ, బెక్కంటి భీమయ్య, నార్లపురం తిరుపతి, బెక్కంటి భీమయ్య, ఉదయ్ గంజి తదితరులు పాల్గొన్నారు.

మిస్ సౌత్ ఇండియా-2024గా శ్రీతేజ

మిస్ ఇండియా యూనివర్స్, మిస్ సౌత్ ఇండియా యూనివర్స్ విజేతగా నిలిచిన తెలంగాణ బిడ్డ శ్రీతేజ

సుల్తాన్ బజార్, డిసెంబర్ 22: తెలంగాణ రాష్ట్రానికి చెందిన వంగరి శ్రీతేజ డీకే పేజెంట్‌లో పాల్గొని మిస్ ఇండియా యూనివర్స్, మిస్ సౌత్ ఇండియా యూనివర్స్ - 2024 విజేతగా నిలిచింది. తెలంగాణ రాష్ట్రం హైదరాబాద్ జిల్లా ముషీరాబాద్ గంగపుత్ర కాలనీకి చెందిన వంగరి శ్రీతేజ నాంపల్లిలోని ఇందిరా ప్రియదర్శిని ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో బీఎస్ఎస్సీ లైఫ్ సైన్స్ ద్వితీయ సంవత్సరం విద్యను అభ్యసిస్తుంది. ఇటు విద్యకు ప్రాధాన్యమిసస్తూనే, అటు మిస్ యూనివర్స్‌కు ఎంపికయ్యేలా సిద్ధమైంది. ఈ సందర్భంగా మిస్ సౌత్ ఇండియా యూనివర్స్ - 2024 విజేత వంగరి శ్రీతేజ మాట్లాడుతూ, నిరుపేద కుటుంబానికి చెందిన తాను పెద్ద కలలు కనే ధైర్యం చేశానని అన్నారు. అభిరుచి, పట్టుదల తనను డాక్టర్ జిమ్మి గరీమా స్థాపించిన ప్రసిద్ధ బ్రాండ్ అయిన కెనోవెడా స్పాన్సర్ చేసిన డీకే బ్యూటీ పేజెంట్‌లో పాల్గొనేలా చేసిందన్నారు. ఎంతో కఠినమైన ఆడిషన్ ప్రక్రియ, అనంతరం, తెలంగాణ రాష్ట్రం నుంచి 50 వేల మంది ప్రతిభావంతులైన వ్యక్తులు ఒక స్థానం కోసం పోటీ పడ్డారని పేర్కొన్నారు. ఈ పోటీలలో తాను మిస్ ఇండియా 2024లో మిస్ సౌత్ ఇండియా 2024 విజేతగా నిలిచినందుకు తనకెంతో గర్వంగా ఉందని, తానెంతో సంతోషిస్తున్నాని అన్నారు. భారతీయ మహిళగా మిస్ యూనివర్స్‌గా ప్రపంచ వేదికపై భారత దేశానికి ప్రాతినిధ్యం వహించడానికి సిద్ధమవుతున్నట్లు వివరించారు. ప్రపంచంలో భారతదేశాన్ని గర్వించేలా చేయడమే తన అంతిమ లక్ష్యమని వంగరి శ్రీతేజ తెలిపారు.

బీఆర్ఎస్ హయాంలోనే గ్రామాలభివృద్ధి

- రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ పతనం ఖాయం
- బీఆర్ఎస్ పార్టీలోకి 50 మంది కాంగ్రెస్, బీజేపీ నేతలు
- మేడ్చల్ ఎమ్మెల్యే చామకూర మల్లారెడ్డి

గోధుమ కుంట నుంచి భారీ సంఖ్యలో బీఆర్ఎస్ పార్టీలో ఎమ్మెల్యే చామకూర మల్లారెడ్డి సమక్షంలో చేరిన నేతలు

కీసర, డిసెంబర్ 22: బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలోనే గ్రామాలన్ని అభివృద్ధి చెందాయని, రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజల విశ్వాసం కోల్పోయిందని మేడ్చల్ ఎమ్మెల్యే చామకూర మల్లారెడ్డి తెలిపారు. కీసర మండలంలోని గోధుమ కుంట గ్రామానికి చెందిన పలు పార్టీలు కాంగ్రెస్, బీజేపీలకు చెందిన నేతలతో పాటు పలు కాలనీవాసులు జంగం శివ యాదవ్, అశోక్ యాదవ్, ఏడు కొండలు, రఘు, మనోజ్ కుమార్, శ్రీనివాస్, మధుసూదన్ రెడ్డి, సాయి యాదవ్, అవిలయ్య, శ్రీశైలంలతో పాటు ఇంకా 50 మంది కార్యకర్తలు ఆదివారం ఎమ్మెల్యే చామకూర మల్లారెడ్డి సమక్షంలో ఆ గ్రామ మాజీ సర్పంచ్ ఆకిటి మహేందర్ రెడ్డి ఆధ్వర్యంలో బీఆర్ఎస్ పార్టీలో చేరారు. బీఆర్ఎస్ పార్టీలోకి ఎమ్మెల్యే వారికి పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, తెలంగాణ రాష్ట్రంలో ఇక కాంగ్రెస్ ప్రభుత్వం పని ఖతమైందని, ఒక సంవత్సరంలోనే ప్రజల్లో పూర్తి వ్యతిరేకత ఏర్పడిందని, సీఎం రేవంత్ రెడ్డి అంత దారిద్ర్యపు ముఖ్యమంత్రి మరెవరూ.. లేరని, ఒక సంవత్సరంలో కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో రాష్ట్రం అన్ని రంగాల్లో దివాలా తీసిందని, ఇప్పుడు ఎన్నికలు పెట్టినా రాష్ట్రంలో మళ్లీ కేసీఆర్‌కు పట్టం కట్టడానికి ప్రజలంతా సిద్ధంగా ఉన్నారన్నారు. ఈ కాంగ్రెస్ ప్రభుత్వంతో ప్రజలంతా ఒక్కసారిగా రోడ్డున పడ్డారని, ఎవరికి పని లేకుండా పోయిందని తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు. గ్రామాలన్నింటిలో బీఆర్ఎస్ ప్రభుత్వం చేపట్టిన పనులే దర్శనం ఇస్తున్నాయి.. తప్ప, కాంగ్రెస్ ఏ గ్రామానికి ఒక్క రూపాయి ఇచ్చిన దాఖలాలు లేవన్నారు. రాష్ట్ర ఖజానా అంతా దిగజారిపోయిందన్నారు. గోధుమకుంట అభివృద్ధి కోసం తను అత్యధిక నిధులను ఇచ్చామని, ఇప్పుడు కూడా కాలనీవాసుల విజ్ఞప్తి మేరకు అనేక నిధులను మంజూరు చేస్తానని వారికి హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ఆ గ్రామ మాజీ సర్పంచ్ ఆకిటి మహేందర్ రెడ్డితో పాటు పలువురు పాల్గొన్నారు.

నోళ్లు తెరిచిన బీళ్లు.. పచ్చని పైర్లు

- కేసీఆర్‌తోనే సాగులో విప్లవాత్మక మార్పు
- ఉత్తముల నోట కేసీఆర్ మా(బా)ట
- అనతికాలంలోనే వ్యవసాయంలో మెరుపు మార్పు
- పలువురు ఉత్తమ రైతులు, శాస్త్రవేత్తలు
- దేశానికి అన్నం పెట్టే వనరులు మన వద్దే ఉన్నాయి
- విశ్రాంత ఐపీఎస్ అధికారి ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్

వజ్రోత్సవ సభలో మాట్లాడుతున్న ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్, చిత్రంలో తదితరులు

వ్యవసాయ యూనివర్సిటీ, డిసెంబర్ 22: ఆరేడు దశాబ్దాలుగా బీడు భూములుగా సాగు నీటికి నోచుకోక నోళ్లు తెరుచుకొని ఓరకు పడ్డ భూములన్నీ తెలంగాణ రాష్ట్రం సిద్ధించడం, కేసీఆర్ రాకతో, ఆ అపర భగీరథుని వ్యూహంతోనే పచ్చని పైర్లుగా వర్ధిల్లాయని పలువురు శాస్త్రవేత్తలు, ఉత్తమ రైతులు, ఐఏఎస్, ఐపీఎస్ అధికారులు అన్నారు. ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ విశ్వవిద్యాలయం వజ్రోత్సవాలను పురస్కరించుకుని రెండు రోజుల పాటు ఘనంగా ఉత్సవాలు జరుపుకుంది. దేశంలోని ప్రధాన శాస్త్రవేత్తలను, ఉత్తమ రైతులను, పూర్వపు, ప్రస్తుత విద్యార్థులను పిలిచి ఘనంగా సత్కరించింది. ఈ సందర్భంగా ఉత్తమ అవార్డులందుకున్న అధికులు గత పదేళ్లలో అప్పటి సీఎం కేసీఆర్ సాగులో విప్లవాత్మక మార్పు తీసుకు వచ్చారని, ఆ ఫలితాలే నేడు మమ్ములను ఉత్తమ రైతుగా, శాస్త్రవేత్తగా నిలబెట్టాయని, ప్రస్తుతం ఇక్కడ విద్యనభ్యసించిన వారు, ఐఏఎస్, ఐపీఎస్, బ్యాంకర్లు, పారిశ్రామిక వేత్తలు, ప్రజాప్రతినిధులుగా బాధ్యతలు చేపట్టిన పలువురు ప్రత్యక్ష, పరోక్షంగా అభిప్రాయం వ్యక్తం చేశారు. రైతుకు అనేక సంక్షేమాలు అమలు చేయడం వల్లే ఎడారిని తలపించే బీ(ఊ)ళ్లన్నీ పచ్చ తోరణాలుగా, ఆత్మహత్యలు లేని తెలంగాణగా దేశ వ్యాప్తంగా గుర్తింపు లభించిందన్నారు. ఈ సందర్భంగా చివరి సెషన్‌లో పూర్వపు విద్యార్థి, విశ్రాంత ఐపీఎస్ అధికారి అయిన ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ మాట్లాడుతూ, వర్సిటీ వజ్రోత్సవ సందర్భంగా వీసీ అల్దాస్ జానయ్య తీసుకున్న చొరవ వల్లే ఇంత మందిమి కలుసుకునే భాగ్యం కలిగిందన్నారు. భారత్‌లో పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా వాతావరణ పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని నూతన వంగడాలు, సేంద్రీయ సేద్యం, నూతన టెక్నాలజీకి అనుగుణంగా సాగువైపు రైతులను మళ్లించాలన్నారు. మనమంతా ఎవ్వరి వృత్తిని వారు గౌరవిస్తూ మంచి ఫలితాలు పొందితే మనం అభివృద్ధి బాటలో నడవటం ఖాయమన్నారు. విద్యావేత్తలు వ్యవసాయాన్ని ప్రోత్సహించాలన్నారు. ప్రపంచ దేశాలలో మనకు ఉన్న వనరులు ఎక్కడా లేవని సూచించారు. సాగు పట్ల మానవ వనరులతో పాటు యాంత్రిక వనరులను అందుబాటులోకి తీసుకురావాలన్నారు.

పలు రకాల పంటలకు మన నేలలు అనుకూలం

దేశంలోనే వివిధ పంటల సాగుకు మన నేలలు, వాతావరణ పరిస్థితులు అనుకూలమన్నారు. ఎక్కువగా చిన్న సన్న కారు రైతులకు అండగా ఉండాలని సూచించారు. ఇతర దేశ వ్యవసాయానికి మనకు చాలా తేడా ఉందని సూచించారు. మన వాతావరణ పరిస్థితులకు తగ్గట్లుగా పరిశోధలు జరగాలని సూచించారు. యాంత్రీకరణ, మార్కెటింగ్ సదుపాయాలపై ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. ఎరువులు, పురుగు మందులు రైతులు అధికంగా వాడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కొత్త సవాళ్లను ఎదుర్కొనేందుకు అవసరమైన వ్యూహాలను రూపొందిండంలో పీజేటీఏయూ వంటి సంస్థలదే కీకల పాత్ర అన్నారు. నేల ఆరోగ్యం, పర్యావరణం, మానవ ఆరోగ్యం వంటి అనేక కోణాలని చూడాలన్నారు. యువతను వ్యవసాయం వైపు పెద్ద ఎత్తున ఆకర్షించగలుగుతామని తద్వారా ఆహార భద్రతను సాధించ గలమన్నారు. డిజిటల్ వ్యవసాయ పద్ధతులను ప్రోత్సహించాలన్నారు. పలువురు అభ్యుదయ రైతులకు వీసీ అల్దాస్ జానయ్య ఆధ్వర్యంలో సన్మానం చేసి ప్రశంసా పత్రాలు అందజేశారు.

ప్రశంసా పత్రాలు అందుకున్న పలువురు ప్రముఖులు

'మహిళా సంఘాల్లో అవకతవకలు జరగలేదు'

మీడియాతో మాట్లాడుతున్న అవంతిక సంఘం సభ్యులు

శంషాబాద్ రూరల్, డిసెంబర్ 22: మహిళా సంఘాలలో ఎలాంటి అవకతవకలు జరగలేదని శంషాబాద్ ఏపీఎం అహల్య తెలిపారు. ఆమె నమస్తే తెలంగాణతో ఆదివారం మాట్లాడుతూ, శంషాబాద్ మండలం నర్కూడ గ్రామంలోని ఓ మహిళ సంఘంలో 'గోల్‌మాల్' అనే శీర్షికతో స్పందించిన ఏపీఎం అహల్య నర్కూడ గ్రామంలోని అవంతిక సంఘంలో సభ్యుల మధ్య సమన్వయం లేకపోవడంతో పాటు సభ్యురాలు సమావేశానికి పూర్తిస్థాయిలో హాజరు కాలేదు. దీంతో ఆమెకు సంఘానికి సంబంధించిన వివరాలపై అనుమానం రావడంతో సదరు సభ్యురాలు భర్త మీడియాకు వివరించారు. దీంతో మీడియాలో వచ్చిన కథనానికి స్పందించి అవంతిక సంఘంలోని సభ్యులకు విచారణ చేశామని ఆరోపనలు చేస్తున్న సభ్యురాలు తీసుకున్న రుణం చెల్లించకుండానే మరో లోన్ ఇవ్వాలని పలుమార్లు సంఘం సభ్యులతో పాటు వీఏవోను అడిగినట్లు తెలిపారు. మొదట తీసుకున్న లోన్ మొత్తం చెల్లిస్తేనే మరో లోన్ ఇస్తామని స్పష్టం చేసినట్లు తెలిపారు. కానీ, సదరు సభ్యురాలు వినిపించుకోకుండా సంఘంలో అవకతవకలు జరుగుతున్నాయని తప్పుడు ఆరోపణలు చేశారని వివరించారు. దీంతో పాటు నర్కూడ గ్రామంలోని అవంతిక సంఘం సభ్యులు మాట్లాడుతూ మా సంఘం 2016 నుంచి ప్రారంభమై ఎలాంటి ఇబ్బందులు లేకుండా సాఫీగా కొనసాగుతుంది. ఇటీవల ఓ సభ్యురాలు తీసుకున్న రుణం చెల్లించకుండానే మరో లోన్ ఇవ్వాలని పట్టుబట్టినట్లు తెలిపారు. తీర్మానాలు, రిజిస్టర్‌లో కొన్ని వివరాలు నమోదు చేయలేదు. కానీ, ఎలాంటి అవకతవకలు జరగలేదు. ఇప్పటి నుంచి ఎలాంటి తప్పులు లేకుండా సంఘాన్ని సాఫీగా కొనసాగిస్తామని తెలిపారు. సంఘం బ్యాంకులో కొంత మేరకు అప్పు ఉంది. అందులో రూ.3.50 లక్షలు చెల్లించాము. రెండు మూడు రోజుల్లో మిగతా అప్పును పూర్తిగా చెల్లిస్తామని స్పష్టం చేశారు.

పుస్తక ప్రదర్శన.. కళాత్మకం

- తెలంగాణ కథ, భాషని బతికించాలి
- డాక్టర్ కాల్వ మల్లయ్య

బొడుసు పుస్తకావిష్కరణలో పాల్గొన్న సాహితీవేత్తలు కాలువ మల్లయ్య, ఆనందాచారి తదితరులు

చిక్కడపల్లి, డిసెంబర్ 22: దోమలగూడ, ఇందిరా పార్క్ సమీపంలోని కళా భారతి ఎన్టీఆర్ స్టేడియంలో 37వ హైదరాబాద్ బుక్ ఫెయిర్ ఆదివారం సందర్శకులతో కళకళలాడింది. 90 వేలకు పైగా పుస్తక ప్రేమికులు సందర్శించారని బుక్ ఫెయిర్ నిర్వాహకులు తెలిపారు. తోపుడు బండి సాదిక్ అలీ వేదికపై వరుసుగా పుస్తకావిష్కరణలు జరిగాయి. 'అంబేద్కర్ ఇజం అంటే ఏంటీ?', 'తిరుపతి బాలాజీ బౌద్ధ క్షేత్రం'తో పాటు 'డాక్టర్ అంబేద్కర్ కణగారని కులాల భవిష్యత్తు' పుస్తకాల ఆవిష్కరణ జరిగింది.

బొడుసు పుస్తకావిష్కరణ

సంగిశెట్టి శ్రీనివాస్, వెల్లండి శ్రీధర్ సంపాదకత్వంలో వచ్చిన 'బొడుసు తెలంగాణ కథ' 2023 పుస్తకాన్ని ప్రముఖ రచయిత కాలువ మల్లయ్య ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, తెలంగాణ కథ, బహుజనుల కథ, తెలంగాణ యువతరం అద్భుతమైన కథలు రాస్తున్నారని అన్నారు. తెలంగాణ కథ, భాషని బతికించాలని అన్నారు. కోడూరి విజయ్ కుమార్, సరోజన బండ్ల, ఎం.దేవేంద్ర, గుడిపెల్లి నిరంజన్, కె.ఆనందాచారి తదితరులు పాల్గొన్నారు.

చదివిన పుస్తకాల్లో ఏది ప్రభావితం చేసిందని చెప్పడం కష్టం

హైదరాబాద్ బుక్ ఫెయిర్ వేదికగా 'సాహిత్య వేదిక పుస్తక స్ఫూర్తి' కార్యక్రమంలో ప్రముఖ సాహితీవేత్తలు అశ్విని కుమార్, ఆరతి హెచ్.ఎన్.లు పాల్గొన్నారు. జి.లక్ష్మి నర్సయ్య అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో వక్తలు ప్రభావం చేసిన పుస్తకాల గురించి చర్చించారు. ఆరతి హెచ్.ఎన్. మాట్లాడుతూ ఇంత వరకు చవిన పుస్తకాల్లో ఏది ప్రభావితం చేసిందని చెప్పడం కష్టం అని అన్నారు. నా తల్లిదండ్రులిద్దరికి సాహిత్యంతో పరిచయం ఉండటంతో నేను పుస్తకాల ప్రపపంచలోనే పెరిగాను. అశ్విని కుమార్ మాట్లాడుతూ పుస్తకాలు మనల్ని సంపూర్ణంగా మార్చేస్తాయి. బాబా సాహెబ్ రాసిన కుల నిర్మూలన, మంటో కథలు, విక్రమ్ సేథ్ పుస్తకాల నన్ను బాగా ప్రభావితం చేశాయని తెలిపారు. రాష్ట్ర గ్రంథాలయ చైర్మన్ రియాజ్, హైదరాబాద్ బుక్ ఫెయిర్ అధ్యక్షుడు కవి యాకూబ్, సాహితీవేత్తలు దేవరాజు, మహారాజు, కొలకలూరి ఇనాక్ .శివారెడ్డి, నిఖిలేశ్వర్ పాల్గొన్నారు.